మేదర బస్తీలో ఎమ్మెల్యే పర్యటన

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని న్యూ అచ్చయ్యనగర్(మేదర బస్తీ)లో వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. మంచి నీరు, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్స్, బోర్‌వెల్, సిన్‌టెక్స్ వాటర్ ట్యాంక్ వంటి పలు సమస్యలను బస్తీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఈ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, శంకర్‌ముదిరాజ్, మన్నె దామోదర్‌రెడ్డి, మురళీ, ఇంద్రసేనారెడ్డి, అరుణ్, నవీన్, జీహెచ్‌ఎంసీ డీఈ గీత, జలమండలి డీజీఎం మోహన్‌రాజు, మేనేజర్ శివసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల మహాసభ జయప్రదం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24న జరిగే టీఎస్–ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్, నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని అన్నారు. మహాసభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముషీరాబాద్: నియోజకవర్గానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ.53,500 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ సోమవారం తన నివాసంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ప్రజలు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భాషా పరిశోధనలో అగ్రగణ్యుడు తిరుమల రామచంద్ర

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ నిర్వహణలో 'రచయిత తిరుమల రామచంద్ర యాదిలో...' శీర్షికతో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రామచంద్ర ఆంధ్రపత్రికలో ఎన్నో ప్రయోగాత్మక వ్యాసాలు రాశారని గుర్తు చేశారు. సీనియర్ జర్నలిస్టు జయసూర్య మాట్లాడుతూ.. భాష పరిశోధనలో అగ్రగణ్యులు రామచంద్ర అని కొనియాడారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

అంబర్‌పేట: ఆహ్లాదకర వాతావరణానికి మొక్కలు ఎంతో దోహదపడతాయని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. సోమవారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్‌లోని ఈస్ట్‌జోన్ కార్యాలయంలో జరిగిన మొక్కలు నాటే కార్యాక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కలు నాటడడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, అంబర్‌పేట ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ గోవాల వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం... గోశాల ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు దోమలగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని మృతుడిని గుర్తిస్తే దోమలగూడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బ్యాగు చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: ఐపీఎస్ అధికారి భార్య చేతి బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఐపీఎస్ అధికారి అనురాగ్ జయంతి భార్య ఆబా గుప్తా ఆదివారం మన్మాడ్ నుంచి కాచిగూడకు అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తోంది. రైలు నిజామాబాద్ స్టేషన్ వద్ద ఉండగా చూసుకోగా ఆపిల్ వాచ్, ఐఫోన్, రెండు జతల చెవి కమ్మలు, రూ.3వేల నగదు, డెబిట్, క్రెడిట్ కార్డులున్న చేతి బ్యాగు కనబడలేదు. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

తీరని నాలా కష్టాలు!

- సమస్య పరిష్కారానికి ధర్నా బాట పట్టిన కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్
- ఏళ్లు గడిచినా పరిష్కారానికి నోచుకుని మొయిన్ చెరువు నాలా సమస్య
- అడ్డంకులను అధిగమించని అధికార యంత్రాంగం
- రెండేళ్లు గడిచిన పూర్తి కాని నాలా అభివృద్ధి పనులు


పటేల్‌నగర్ చౌరస్తా నాలా నీటిలో ధర్నా చేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: డివిజన్‌కు ప్రధాన సమస్యగా మారిన నాలా సమస్య పరిష్కారం కావడం లేదు. ఏళ్ల తరబడి అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల మీదుగా ప్రవహిస్తున్న నాలాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలం వచ్చిందంటే ఇక్కడి నాలాతో ప్రజలు సావాసం చేయాల్సిందే. పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏళ్లు గడుస్తున్న కొలిక్కి రావడం లేదు. ఏడాది పోడవున అధికారుల చుట్టు తిరిగినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. నాలా సమస్యకు శాస్వత పరిష్కారం చేయాలని చేసిన ప్రయత్నాల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దీంతో అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆకస్మికంగా ధర్నాకు దిగారు. సోమవారం చౌరస్తాలోని పారుతున్న నాలా నీటిలో కుర్చీలు వేసుకుని ధర్నాకు కుర్చున్నారు. ఏడాది పొడవున అధికారుల చుట్టూ తిరిగినా పనుల్లో పురోగతి లేకపోవడంతో కార్పొరేటర్ అసహనానికి గురై కార్పొరేటర్ ధర్నాకు దిగారు.

ఇది అసలు సమస్య....

అంబర్‌పేట డివిజన్ మీదుగా మొయిన్‌చెరువు నాలా ప్రవహిస్తోంది. ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న మొయిన్‌చెరువు నీరు బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్, రహత్‌నగర్‌ల మీదుగా అంబర్‌పేట డివిజన్‌లోకి ప్రవేశిస్తుంది. ఈ నాలా అంబర్‌పేట డివిజన్‌లోని ఓవైసినగర్, చెన్నారెడ్డినగర్, పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, న్యూప్రేమ్‌నగర్‌ల మీదుగా మూసీ నదిలో కలుస్తుంది. మెజార్టీ జనవాసాల నుంచి ప్రవహిస్తుడడంతో వర్షకాలంలో నాలా పొంగిపొర్లి వర్షపునీరు ఇళ్లలోకి వస్తుంది. దీంతో చిన్నాపాటి వర్షం పడినా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారు. ప్రతి వర్షాకాలంలో వర్షపునీటితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తీసుకుంటున్న నిర్ణయాలు, చేపట్టిన పనలు నేటికి కొలిక్కి రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా నాలా పనులు సత్వరమే పూర్తి చేయాలని పలువురు కోరాతున్నారు.

ఎన్నో అడ్డంకులు...

నాలా అభివృద్ధి కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో చేపట్టారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. ఓ వైపు నాలాపై ఆక్రమణలు, పోలీసు స్థలం కావడంతో ఆ విభాగం నుంచి అనుమతులు కావాల్సి ఉండడంతో నాలా పనులు 'ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి..'అన్న చందంగా మారింది. నాలాపై నిర్మాణాలు ఉండడంతో కూడ అభివృద్ధికి పెద్ద సవాలుగా మారింది. వీటన్నింటిని అధిగమించి చేపట్టాల్సిన నాలా అభివృద్ధి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం సైతం తోడు కావడంతో మరింత జాప్యం జరుగుతుంది.

ధర్నాలకు కేరఫ్‌గా మారిన కార్పొరేటర్...

అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ధర్నాలకు కేరాఫ్‌గా మారారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్‌గా ఎన్నికైన విజయ్‌కుమార్‌గౌడ్ అప్పట్లో సైతం ఇదే నాలా సమస్యపై ధర్నా చేపట్టడం చర్చనీయాశమయ్యింది. కార్పొరేటర్‌గా ఉంటూ ప్రజా సమస్యపై తరచు ధర్నాలు చేయడం పట్ల పలువురు ప్రశంసించడంతో పాటు విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు పనుల కాక ధర్నాలు చేస్తున్నారంటే సమస్య ఎలాంటిదో ఒక అంచనా వేయొచ్చని పలువురు వాఖ్యానిస్తున్నారు. నియోజకవర్గంలో అత్యధిక సమస్యలు ఉన్న డివిజన్‌గా అంబర్‌పేట ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా కార్పొరేటర్ పరిష్కరించడానికి 'ధర్నా'మార్గాన్ని ఎంచుకోవడం హర్షణీయమని స్థానికులు పేర్కొంటున్నారు.

ఓప ఫైల్ చేయని వారిపై చర్యలు తీసుకోండి

మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ రామయ్య ఆదేశాలు బేఖాతరు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ భూముల పరిరక్షణపై ఓప ఫైల్ చేయాలన్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ రామయ్య అయ్యంగార్ ఆదేశాలను బేఖాతరు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త గొర్ల చంద్రశేఖర్ యాదవ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాత శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించి 1576 గజాల స్థళాన్ని ఆక్రమించుకొని ఇళ్లు కట్టారన్నారు. ఈ స్థంల దేవాదాయ శాఖకు చెందాలని మంత్రి కొండ సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ రామయ్య అయ్యంగార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై ట్రిబ్యునల్ కోర్టులో ఓప ఫైల్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వారు తెలిపారు. అయితే మంత్రి ఆదేశాలను దేవాదాయ శాఖ ఆర్‌జేసీ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఈఓ అన్నపూర్ణ వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఓప ఫైల్ చేయకుండా జాప్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ట్రిబ్యునల్ కేసు ఫైల్ చేస్తాం: ఈఓ అన్నపూర్ణ

అన్ని రికార్డులను సమకూర్చి వారం పదిరోజుల్లో ట్రిబ్యునల్‌లో కేసు ఫైల్ చేస్తామని వేంకటేశ్వర స్వామి ఆలయం ఈఓ అన్నపూర్ణ అన్నారు. టెంపుల్ 38వ రిజిస్టర్, 43వ రిజిస్టర్‌లో వివరాలు లేవన్నారు. హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ అప్రూవల్ చేసి ఇవ్వాల్సి ఉందన్నారు. అప్రూవల్ రాగానే ట్రిబ్యునల్ కోర్టులో ఫైల్ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచాలి

అంబర్‌పేట్ క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్‌పీహెచ్‌వో డా. శ్రీకళ



ముషీరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను మరింత పెంచడంతో పాటు గర్భిణులు, బాలింతల పర్యవేక్షణను జాగ్రత్తగా నిర్వహించాలని అంబర్‌పేట్ క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్‌పీహెచ్‌వో డా. శ్రీకళ అన్నారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి ప్రాంగణంలో అంబర్‌పేట్ క్లస్టర్ పరిధిలోని ఆరు యూపీహెచ్‌సీలు, 12 బస్తీ దవాఖానాల వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డా. శ్రీకళ మాట్లాడుతూ... వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. మనోజ్‌రెడ్డి, డా. దీప్తి పటేల్, డా. మౌనిక, కౌశర్, హరిశ్రీ, డా. శివ, డా. హాసిని, డా. జిలాని, డా. విష్ణు, డా. ఆరీఫా, డా. అమీనా, డా. స్వప్న, డా. రష్మిక, డా.నజీయా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం అధికం

అంబర్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చేయూతనిస్తే వారు జీవితంలో ఎంతో ఆత్మ విశ్వాసంతో రాణిస్తారని బతుకమ్మకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ శర్మ తెలిపారు. సోమవారం ఐటీ ఉద్యోగి ఫణికుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇక్కడి పాఠశాలలో ఉన్న 150 మంది విద్యార్థులకు జామెట్రిక్ బాక్స్‌లు, పరీక్షా ప్యాడ్‌లను పాఠశాలకు అందజేశారు. వాటిని ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. మంచిగా చదువుకుంటే ఐటీ ఉద్యోగి ఫణికుమార్‌లాగా జీవితంలో ఎదిగి మీరు కూడా ఇతరులకు ఇలా చేయూతనివ్వొచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరత్ బాబు, మహ్మద్ యాదుల్లా, మల్లికార్జున్‌గుప్తా, వర్జినికుమారి, మాధురి తదితరులు పాల్గొన్నారు.



వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తా


అంబేడ్కర్ కళాశాలలో మంత్రి వివేక్ దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్య ద్వారా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు మా తండ్రి కాకా ఆశయాలను కొనసాగిస్తామని కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది మంత్రికి డప్పు వాయిద్యాలు, కోలాటాలు, డీజే పాటలతో పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది మంత్రిని ఘనంగా సన్మానించారు. అనంతరం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. అంబేడ్కర్ విద్యా సంస్థలను మరింత ఉన్నత స్థాయికి తీసుకుపోయి పేద విద్యార్థులకు సేవాలందిస్తామన్నారు. విద్యా సంస్థల చైర్మన్‌గా మా తండ్రి ఆదర్శాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సరోజ వివేకానంద్, సీఈఓ ప్రొ. లింబాద్రి, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపల్ మట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు నూతనోత్తేజాన్ని కలిగిస్తాయి



చిక్కడపల్లి: పురస్కారాలు మరింత బాధ్యతను పెంచడంతోపాటు నూతనోత్తేజాన్ని కలిగిస్తాయని సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. విశ్వఆర్ట్స్ మన కళాక్షేత్రం ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన అవార్డుల ప్రధాన ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సామాజిక సేవకుడు వెలిజాల వెంకటేష్, జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డిలకు సేవా ఐకాన్ అవార్డు, ఇంస్టాగామ్ సెలబ్రిటీ కావ్య, మల్లేశ్వరిలకు యోగా ఐకాన్ అవార్డులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉండొద్దు

అంబర్‌పేట: సీజనల్ వ్యాధులను నివారించడంలో పారిశుద్ధ్యం విభాగం కీలక పాత్ర పోషించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీదివాకర్ తెలిపారు. సోమవారం గోల్నాక డివిజన్ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా వర్షకాలంలో పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆయన సూచించారు. పారిశుద్ధ్య లోపంతో అనేక వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని అవి సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. సీజనల్ వ్యాధులను నివారించడానికి మెరుగైన పారిశుద్ధ్యం అవసరమన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానని అన్నారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలత, ఎఫ్ఎస్ఏలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

సిల్ట్ వాహనదారుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ముషీరాబాద్: సిల్ట్ సేకరించే వాహనాదారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని తెలంగాణ దళిత సిల్ట్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్‌లో అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా సిల్ట్‌ను సేకరించే వాహన కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగడం లేదన్నారు. తమ హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా దళిత సిల్ట్ వాహన కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై నాగరాజు బదిలీ

చిక్కడపల్లి: చిక్కడపల్లి పీఎస్ అడ్మిన్ ఎస్సై నాగరాజు బదిలీ అయ్యారు. రెండురోజుల్లో ఆయన మొఘల్‌పురా పీఎస్‌కు బదిలీపై వెళ్తారు. చిక్కడపల్లి పీఎస్ నూతన ఎస్సైగా సంతోష్‌నగర్‌లో విధులు నిర్వర్తిస్తున్న శివప్రసాద్ రానున్నారు.

ఎమ్మెల్యేకు 'ప్రజల కథే నా ఆత్మకథ'పుస్తకం బహూకరణ


ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న దతన్న

ముషీరాబాద్: హరియాణా గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ'పుస్తకాన్ని సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు బహూకరించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ రాంనగర్‌లోని దత్తాత్రేయ నివాసానికి వచ్చి ఆ పుస్తకాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దత్తాత్రేయ ప్రజల మనిషి అని గల్లీస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఎదిగిన గొప్ప నాయకుడని కొనియాడారు.

యువత భక్తి మార్గంలో పయనించాలి

చిక్కడపల్లి: యువత భక్తి మార్గంలో పయనించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పిలుపునిచ్చారు. వరాల పోచమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం గాంధీనగర్‌లో జరిగింది. పూజలకు హాజరై ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, నాయకులు కొమురయ్య, ముఠా నరేష్, దీటి రాంచందర్, కనకరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు



డీవీ మోహనకృష్ణ గాత్ర కచేరి

నల్లకుంట: శ్రీరామగాన సభ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి(న్యూ రామాలయం) ఆలయ ప్రాంగణంలో 56వ వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అయ్యగారి శ్యామసుందర్, ప్రత్యేక ఆహ్వానితులుగా యనమండ్ర బాల ఆదిత్యలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. అంతకు ముందు మంగళ వాద్యం, రోహిణి అశోక్ రావు, టీఎం. వాసుకిల గాత్ర కచేరి నిర్వహించారు. అనంతరం 7 గంటలకు బాలమురళీకృష్ణ ప్రియ శిష్యుడు, ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ. మోహనకృష్ణ నిర్వహించిన గాత్ర కచేరి ఆహుతులను ఆకట్టుకుంది.

రైతులకు న్యాణ్యమైన విత్తనాలను అందించాలి

టీఆర్‌ఎల్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్

కవాడిగూడ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులను తక్షణమే కేబినెట్ నుంచి తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని టీఆర్‌ఎల్‌డీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం టీఆర్‌ఎల్‌డీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిరసన దీక్షను నిర్వహించారు. ఈ నిరసన దీక్షకు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి గుండె విజయరామారావు, సామాజికవేత్త నారగోని హాజరై మద్దతు ప్రకటించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలన్నారు. మంత్రుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకోకపోతే మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టం 2009ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. లక్షల్లో ఫీజులు వసూలు చేయడంతో ఎస్సీ ,ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నివాళులర్పిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి,బీజేపీ నాయకులు



'యోగా దినోత్సవం'



నల్లకుంట తిలక్‌నగర్‌లోని శ్రీ విద్య సెకండరీ పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ యోగా దేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు యోగాసనాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - నల్లకుంట

శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దాం

బలిదాన్ దివస్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సోమవారం బలిదాన్ దివాస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేసేందుకు శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి గుర్తుంటుందని అన్నారు. 1951వ సంవత్సరంలో భారతీయ జనసంఘ్‌ను స్థాపించారని ఆయన గుర్తు చేశారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రమంత్రిగా పనిచేసి విశిష్టమైన సేవలను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గౌతమ్ రావు, వెంకటస్వామి, గంగరాజు, శ్యామ్‌రాజ్, రాజశేఖర్‌రెడ్డి, భరత్‌గౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని బలిదాన్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు నివాళులర్పించి మొక్కలు నాటారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి దత్తన్న నివాళి

ముషీరాబాద్: హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ రాంనగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.